www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 3 జనవరి 2025

5

తూర్పుగోదావరి

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని తంటికొండ, గోపాపురానికి బస్సు సౌకర్యం కల్పించాలని టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు స్కూల్ చైర్మన్ నాగం వెంకటపతి మంగళవారం గోకవరం ఆర్‌టిసి అధికారులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.2 కోట్లతో స్థానిక ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ చొరవతో తంటికొండకు రోడ్డు పూర్తయ్యిందని, రోడ్డు పనుల నిమిత్తం ఆగిన ఆర్‌టిసి సర్వీసులను పునరుద్ధరించాలని తెలిపారు. గోపాలపురం, ఇటికాయలపల్లి, గాదెలపాలెం, తంటికొండ గ్రామాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గోకవరం రావడానికి ప్రధానంగా నాలుగు గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారనిచ అందుకు విద్యార్థులకు, ప్రజలకు ఆర్‌టిసి బస్సు సౌకర్యార్థం ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ ఆర్‌టిసి అధికారులతో మాట్లాడినట్టు తెలిపారు.

పేదల సొంతింటి కలపై నీలి నీడలు

- కొవ్వూరు పట్టణంలో అసంపూర్తిగా ఇళ్లు
- రాజమహేంద్రవరంలో వసతుల కరువు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పట్టణ పేదల సొంతింటి కల సాకారంపై నీలి నీడలు కమ్ముకున్నాయి. జిల్లాలో రాజమహేంద్రవరం, నిడదవోలు, కొవ్వూరు పట్టణాల్లో టిడ్కో ఇళ్లు నిర్మించిన విషయం విదితమే. రాజమహేంద్రవరంలో కేటాయించిన ఇళ్లకు మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. కొవ్వూరు, నిడదవోలు పట్టణాలలో ఇళ్ల నిర్మాణానికి నిధుల గ్రహణం వెంటాడుతోంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు టిడ్కో లబ్ధిదారులకు ఇచ్చిన హామీ 8 నెలలైనా ఆచరణలో అమలుకు నోచుకోలేదు. రాజమహేంద్రవరంలో ఏడు ప్రాజెక్టుల కింద 6,304 టిడ్కో ఇళ్లు నిర్మించారు. అందులో 5,574 మందికి రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. ఇంకా 690 మందికి పెండింగ్‌లో ఉన్నాయి. రిజిస్ట్రేషన్ పూర్తయిన ఇళ్లలోనూ మౌలిక సదుపాయాలు లేకపోవడంతో చాలా తక్కువ మంది మాత్రమే గృహ ప్రవేశాలు చేసుకున్నారు. అదే విధంగా నిడదవోలులో 1,755 ఇళ్లు మంజూరు కాగా 1,248 ప్రారంభించారు. కొవ్వూరులో 480 మంజూరు కాగా 480 ప్రారంభించారు. బొమ్మూరులో మొదటి దశలో 2,528 ఇళ్లు నిర్మించారు. తొర్రేడులో 896, మోరంపూడి డిబ్లాక్ వద్ద 224, ధవళేశ్వరంలోని వడ్డెర కాలనీలో 256 నిర్మించారు. ఇప్పటి వరకూ బొమ్మూరులో నిర్మించిన ఇళ్లలో 2,528 ఇళ్లను లబ్ధిదార్లకు అప్పగించగా 1,977 మంది మాత్రమే తాళాలు తీసుకున్నారు. బొమ్మూరు రెండో దశలో నిర్మించిన 2 వేల ఇళ్లను ఇంకా అప్పగించలేదు. తొర్రేడులో నిర్మించిన 896 ఇళ్లలో 500 ఇళ్లను లబ్ధిదారులు పొందారు. ధవళేశ్వరం (వడ్డెరకాలనీ)లో నిర్మించిన 256 ఇళ్లలో 234 అప్పగించారు. మోరంపూడి డి.బ్లాక్ 224 ఇళ్లలో 96 లబ్ధిదారులకు అప్పగించినా ఎవరూ రాలేదు. కేవలం ఒక్కరు మాత్రమే నివాసం ఉంటున్నారు. రెండో దశలో నామవరంలో 1,104 ఇళ్లు, సింహాచల్ నగర్‌లో 96 ఇళ్లు, బొమ్మూరు ఫేజ్-2లో 1,200 నిర్మించారు. ఇవి ఇంకా పూర్తి కాలేదు. కొవ్వూరు పట్టణంలో 480 మందికి, నిడదవోలు పట్టణంలో 1,248 మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. దాదాపు 80 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయి. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయించేందుకు ప్రభుత్వం నిధులు సమకూర్చడం లేదు. నిడదవోలు, కొవ్వూరు పట్టణాలలో టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయడానికి రూ.27 కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. వీటిలో కొవ్వూరుకు రూ.5 కోట్లు, నిడదవోలుకు రూ.22 కోట్లు కావాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఇంతవరకూ ఆ నిధులు విడుదల కాలేదు. అదే విధంగా మౌలిక సదుపాయాలకు రూ.17 కోట్లు అవసరమని అధికారులు చెబుతున్నారు. కొవ్వూరు, నిడదవోలు పట్టణాలల్లో టిడ్కో ఇళ్ల సముదాయాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పనకు రూ.17 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు ప్రతిపాదలను తయారు చేసి పంపించారు. దీనిలో నిడదవోలులో రూ.11 కోట్లు, కొవ్వూరులో రూ.6 కోట్లు అవసరం అవుతాయని అధకారులు లెక్కలు తేల్చారు. ఈ టిడ్కో ఇళ్లను పట్టణ శివార్లలో పొలాల్లో నిర్మించారు. లబ్ధిదారులు అక్కడికి చేరుకోవడానికి రోడ్లు, వీధిలైట్లు, తాగునీటి సరఫరా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, డ్రైన్ల నిర్మాణం వంటి పనులు చేపట్టాలి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏ విధమైన నిధులూ విడుదల కాకపోవటంతో మౌళక సదుపాయాల ఊసే లేదు. నిడదవోలు నుంచి కందుల దుర్గేష్ పర్యాటక శాఖ మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయినప్పటికీ టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయించేందుకు నిధులు సమకూర్చలేకపోయారు. దీంతో లబ్ధిదారుల సొంతింటికల సాకారం అయ్యే పరిస్థితి కన్పించడంలేదు.

రాజమహేంద్రవరం రూరల్‌లో టిడ్కో గృహాలు

జిల్లాలో ప్రగతి లక్ష్యాల అమలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడుతో కలిసి జిల్లాలో ప్రగతి లక్ష్యా అమలుపై గురువారం పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఉచిత ఇసుక విధానాన్ని మరింతగా ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చే విధంగా డీసిల్టేషన్, పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆ మేరకు సెమిమెకానిక్ విధానం ద్వారా 52.82 లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యంగా ముందు కెళుతున్నామన్నారు. పబ్లిక్ హియరింగ్ అనంతరం మార్చి మొదటి వారంలో అందుబాటులోకి తేనున్నామన్నారు. రాష్ట్రంలో సరఫరా అయ్యే వాటిలో జిల్లా నుంచి 65 శాతం సరఫరా అవుతోందన్నారు. ఇసుక సరఫరా ఏజెన్సీల కాలపరిమితి ముగిసిందని, నూతన ఏజెన్సీలు వస్తే మరింత ఇసుక లభ్యత అందుబాటులో ఉంటుందన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి జిల్లాలో 2 లక్షల 52 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. రూ.580 కోట్లు రైతులు ఖాతాలకు జమ చేశామన్నారు. చాలా కాలంగా పెండింగ్లో ఉన్న 146 ఎఫ్‌పి షాపులకు నోటిఫికేషన్ జారీ చేసినట్టు తెలిపారు. ఈ షాపులను రోస్టర్ ప్రకారం, రిజర్వేషన్ ప్రాతిపదికలపై అందజేస్తామన్నారు.

ఆర్ అండ్ బి రహదారులకు గుంతలు పూడ్చే ప్రక్రియలో భాగంగా జిల్లాలో 531 కిలోమీటర్ల లక్ష్యానికి ఇప్పటివరకు 187 కిలోమీటర్లు పూర్తి చేసినట్టు తెలిపారు. మిగిలినవా మూడు వారాల్లో పూర్తి చేస్తారన్నారు.

ఎన్‌ఆర్‌ఇజిఎస్ కింద పల్లె పండుగ కార్యక్రమం ద్వారా సిసి రోడ్లు, డ్రైన్స్‌కు అత్యంత ప్రాధాన్యతనిస్తూ జిల్లాలో ఎన్ టైటిల్మెంట్ రూ.88 కోట్లకు గాను మరింత వేగవంతంగా పనులు పూర్తయ్యేందుకు రూ.142 కోట్లు మంజూరు చేయగా 50 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. జిల్లాలో స్వయం సహాయక సంఘ గ్రూపులు ఆర్థికంగా శక్తివంతంగా ఉన్నాయన్నారు. జిల్లాలో డెయిరీ యూనిట్స్, ఎస్‌హెచ్‌జి, పౌల్ట్రీ, పిఎంఇజిపిని అభివృద్ధి చేయడం ద్వారా ఎస్‌హెచ్‌జి గ్రూప్స్ మరింత ఆర్థికంగా బలోపేతం చెందుతాయన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 230 గ్రామాలలో చేపట్టిన రెవెన్యూ సదస్సులలో 2,903 అర్జీలను స్వీకరించినట్టు తెలిపారు. వాటిలో 1,041 పరిష్కరించునట్లు తెలిపారు.

పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ఎస్‌పికి నర్సరీ రైతుల స్వాగతం

ప్రజాశక్తి-కడియం

కడియం మండలం వేమగిరి వచ్చిన ఎస్‌పి నరసింహ కిశోర్‌కు ప్రముఖ నర్సరీ రైతు, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు మార్గాని సత్యనారాయణ పూల మొక్కతో సాగతం పలికారు. నర్సరీ ప్రాంతాల్లో తరచూ మొక్కలు చోరీకి గురవుతున్నాయని భద్రత పెంచాలని విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎస్‌పి కడియం నర్సరీ రైతులకు తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఎస్‌పికి మొక్కను అందజేస్తున్న మార్గాని

ప్రజా సంఘాల కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - నిడదవోలు

ప్రజా సంఘాల కార్యాలయాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ గురువారం ప్రారంభించారు. నిడదవోలు సంత మార్కెట్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చౌక్ చర్చ్ పేటలో భవనంలో ప్రజా సంఘాల కార్యాలయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలు, ఉద్యోగ కార్మిక, దళిత సమస్యలపై పోరాటం చేసే ప్రజా సంఘాలు సొంత కార్యాలయం ఏర్పాటు చేసుకోవటం అభినందనీయం అన్నారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలు, ఉద్యోగ, కార్మిక, యువజన దళితుల సమస్యల పరిష్కారానికి ఉద్యమ కేంద్రంగా కార్యాలయం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి యునైటెడ్ ప్రభుత్వ, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ నర్సెస్ యూనియన్ జెఎసి చైర్మన్ దయామణి, సిఐటియు నాయకులు జి.డానియల్, గంటి కృష్ణ, యర్రా శ్రీను, కెవిపిఎస్ నాయకులు డొంకా రమేష్, పెయింటర్స్ యూనియన్ నాయకులు ఉసురుమర్తి ప్రభాకర్, టి.చిరంజీవి, సాయి రమణ, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అరుణ్

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ప్రజాశక్తి నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి బొమ్మూరు సెంటర్‌లోని కలెక్టరేట్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ ప్రజాశక్తి క్యాలెండర్ కళారూపాలతో చాలా బాగుందని ఆమె ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి సిబ్బంది రవీంద్ర, నాగభూషణం, విలేకరి గొల్ల దినేష్ కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా తాత్కాలిక నిలిపివేత

ప్రజాశక్తి-ఉంద్రాజవరం

మండలంలోని 33/11 కెవి.పాలంగి సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం సబ్ స్టేషన్ పరిధిలో పాలంగి, కె.సావరం, చివటం గ్రామాలకు విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు సహకరించవలసిందిగా కోరారు.

సంక్రాంతి క్రీడల నిర్వహణ అభినందనీయం

ప్రజాశక్తి - గోపాలపురం

సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామస్తులంతా ఐక్యంగా సంక్రాంతి క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమని ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. మండలంలోని వేళ్లచింతలగూడెంలో సంక్రాంతిని పురస్కరించుకుని ఆర్ అండ్ ఎమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను గురువారం ఫౌండేషన్ చైర్మన్ ఘంటా మధు కృష్ణ ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎ వెంకటరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు, సాంప్రదాయాలు రాజకీయాలకు అతీతంగా నిర్వహించుకోవడం అభినందనీయమని అన్నారు. ఆర్ అండ్ ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నాలుగేళ్లుగాఈ పోటీలు నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. ఈ ఏడాది సంబరాలను మరింత భారీ స్థాయిలో ఘనంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నిర్వాహక సభ్యులు మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంట్‌లో రాష్ట్రంలో పలు జిల్లాలు నుండి 16 జట్లు తలబడునున్నట్టు తెలిపారు. పది రోజులపాటు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ టోర్నీలో ప్రథమ ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.1,50,000, రూ.75000, రూ.30000 నగదుతో పాటు జ్ఞాపిక అందిస్తారని అన్నారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌కు రూ.10,000, ఉత్తమ బాట్స్‌మ్యాన్‌కు రూ.5000, ఉత్తమ బౌలర్‌కు రూ.5000 నగదు బహుమతులు ఉంటాయన్నారు.

ఈ నెల 7,8,9 తేదీలలో వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పలు జిల్లాలో చెందిన ఎనిమిది పురుష జట్లు రానున్నాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు రూ.50,000, రూ.40,000, రూ.30,000 జ్ఞాపిక అందిస్తారని తెలిపారు.

ఈ నెల 11,12,13 తేదీల్లో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని, 16 టీములు పాల్గొంటున్నాయని చెప్పారు. వాలీబాల్ పోటీలలో 16 టీములు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో 8 పురుష జట్లు, జాతీయస్థాయిలో 8 మహిళ జట్లు రానున్నాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ, 4వ విజేతలకు రూ.1,50,000, రూ.10,0000, రూ.75000, రూ.50,000 నగదుతో పాటు జ్ఞాపికలు అందించినట్లు తెలిపారు. వీటితోపాటు మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించి విజేతలకు భారీ స్థాయిలో బహుమతులు అందజేయన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, జెడ్‌పిటిసి కె.లలిత, పిన్నమనేని చినబాబు, పిన్నమనేని నాగేంద్ర, ఇల్లూరి రాంబాబు, కొర్లపాటి రాము, సర్పంచ్ గోళ్ల దండియ్య, ఎంపిటిసి సభ్యులు సముద్ర కొండయ్య, సిఐ నాగేశ్వర్ నాయక్, ఎస్‌ఐ కె.సతీష్ కుమార్, కొర్లపాటి రాజా పాల్గొన్నారు.

సంక్రాంతి పోటీలను పారంభిస్తున్న ఎంఎల్‌ఎ మద్దిపాటి

పేపర్ మిల్లు కార్మికులకు అండగా సిఐటియు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

పేపర్ మిల్లులో వేతన ఒప్పందం కోసం కార్మికుల సమ్మె నిర్వహిస్తున్నా యాజమాన్యం నిర్లక్ష్యం చెయ్యడాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ తీవ్రంగా ఖండించారు. మిల్లులో కార్మికులు బి షిఫ్ట్, జనరల్ షిఫ్ట్ డ్యూటీలో ఉన్నవారు అందరూ విధులను బహిష్కంరించారు. దీంతో మిల్లులో ఉత్పత్తి నిలిచి పోయింది. కార్మికులకు మద్దతుగా సిఐటియు నాయకులు టి.అరుణ్, బి.పవన్, పూర్ణిమరాజు, సోమేశ్వరావు గేటు వద్ద నిలిచారు. రాజానగరం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణకు అరుణ్ కార్మికుల సమస్యలను వివరించారు. కార్మికుల పోరాటానికి సహకరించాలని అక్కడకు వచ్చిన పోలీస్ అధికారులను విజ్ఞప్తి చేశారు. యాజమాన్యం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అరుణ్ డిమాండ్ చేశారు.

ఎంఎల్‌ఎ బత్తులకు సమస్యలు వివరిస్తున్న అరుణ్

ఎస్‌ఎఫ్‌ఐ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఎస్ఐఎఫ్ఐ వాల్ క్యాలెండర్‌ను సబ్ కలెక్టర్ ఆర్.కృష్ణ నాయక్ గురువారం ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా మాట్లాడారు. విద్యార్థులలు, ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 10, ఇంటర్ పరీక్షలు దగ్గరకు వస్తున్నాయని విద్యార్థులు అందరూ బాగా చదువుకుని పరీక్షలో మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. డిగ్రీ ఆర్.జె.డి శోభా రాణి, ఇంటర్మీడియట్ ఆర్ఐఒ నరసింహారావు, డిబిసిడబ్ల్యు సుశాంకను కలిసి నూతన క్యాలెండర్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని, పీజీ చదివే విద్యార్థులకు జిఒ నెం.77 రద్దు చేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని, హానర్స్ డిగ్రీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.జ్యోతి, కనక, సాహితి, చైతన్య, దుర్గ, మౌళి, శివ బాలాజీ, మేఘన, హేమంత్, కార్తిక్ పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ కృష్ణ నాయక్

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లా వ్యాప్తంగా అన్నీ ప్రభుత్వ పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని జూనియర్ కళాశాలల్లోనూ అమలు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టరు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న 5,425 మంది విద్యార్థినీ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయనున్నట్లు తెలిపారు. జనవరి 4న స్థానికంగా ఉన్న ఎంఎల్‌ఎ సమక్షంలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ఘనంగా ప్రారంభించడానికి చురుగ్గా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టరు తెలిపారు. జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలులో భాగంగా 12 కాలేజీలను సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులను అనుసంధానం చేసినట్టు తెలిపారు. రాజమహేంద్రవరం జూనియర్ కళాశాలకు, ధవళేశ్వరం జెడ్‌పి హైస్కూల్ ఆవరణలో ఉన్న జూనియర్ కళాశాలకు, రంగంపేట జెడ్‌పి హైస్కూల్ ఆవరణలో ఉన్న జూనియర్ కళాశాలకు ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. పకడ్బందీగా జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం కోసం జిల్లా పాఠశాల విద్యా అధికారితో సంబంధిత జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సమన్వయం చేసుకుంటారని తెలిపారు. దీనికి సంబంధించిన జూనియర్ కళాశాల ప్రిన్సిపల్స్, ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంలతో సమన్వయం చేసుకోవడం, వండిన ఆహార పదార్థాలను ఆయా జూనియర్ కళాశాల విద్యార్థులకు అందజేసేందుకు ఏర్పాట్లు చేసుకోవడంపై దిశా నిర్దేశం చేసినట్టు తెలిపారు.



స్కూల్ పేరెంట్స్ కమిటీలకు శిక్షణ

ఎపి సమగ్రశిక్ష, పాఠశాల విద్య ఆధ్వర్యంలో రోల్స్ అండ్ రెస్పాన్సిబిలిటీస్ ఆఫ్ ది స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీస్ ప్రోగ్రామ్‌లో భాగంగా నూతనంగా ఏర్పడిన పాఠశాల యాజమాన్య కమిటీలకు గురువారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉండ్రాజవరం ఉండ్రాజవరం పాఠశాల-1లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఇఒ-1 సిహెచ్.సక్సేనా రాజు మాట్లాడారు. విద్యార్థులు తరచూ గైర్హాజరు కాకుండా, హాజరు పెంచేలా చర్యలు తీసుకోవాలని, పాఠశాలలో విద్యార్థుల సర్వతోముఖాభివద్ధికి అవసరమయ్యేలా, ఉపాధ్యాయుల పనితీరును మెరుగు పరిచేలా సలహాలు సూచనలు అందజేయాలని కోరారు. పాఠశాల యాజమాన్య కమిటీ విధులు, బాధ్యతల గురించి వివరించారు. ఎంఇఒ-2 డి.శారదా జ్యోత్స్న మాడ్యూల్‌లోని విషయాలను వివరించారు. ఆర్‌పిలు పి.ఆంజనేయులు, పిఎస్‌వి.సత్యనారాయణ, ఎం.తిరుపతి రావు, కె.రామకృష్ణ వ్యవహరించారు.

గోపాలపురం మండలంలోని అన్ని పాఠశాలల యాజమాన్య కమిటీ సభ్యులకు ఎంఇఒ జి.శ్రీనివాసరావు అధ్యక్షతన శిక్షణ ఇచ్చారు. ఎంఇఒలు జి. శ్రీనివాసరావు, ఎ.మహేశ్వరరావు మాట్లాడుతూ ఎస్‌ఎంసి సభ్యులు పాఠశాలల అభివద్ధిలో సమర్థవంతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు సమస్యలు, పరిష్కారాలను వివరించారు. పాఠశాల యాజమాన్య కమిటీ ఏర్పాటు, విధులు, బాలల హక్కులు, పాఠశాల అభివద్ధి ప్రణాళిక, పాఠశాలల సామాజిక తనిఖీ, ప్రజల భాగస్వామ్యం, బడి బయట పిల్లలు, మనబడి-మన భవిష్యత్తు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం, తదితర విషయాలను సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ సిఎంఒ కె.శ్రీనివాసరావు, ఎఎంఒ డి.గౌరీ శంకరరావు శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి, నిర్వహణ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లుగా ఎంఎస్.సుబ్రహ్మణ్యం, పి.సుబ్రహ్మణ్యం, ఒ.భవ్యశ్రీ, సిఆర్‌పిలు నాగరాజు, లక్ష్మణ్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

తాళ్లపూడి పర్యావరణ పరిరక్షణతో, విద్యార్థులకు మంచి మధ్యాహ్న భోజనం అందించడంతోపాటు పాఠశాలల అభివద్ధిలో యాజమాన్య కమిటీ ఉన్నత పాత్ర పోషించాలని శిక్షకులు సూచించారు. మండలంలోని వేగేశ్వరపురం ఉన్నత పాఠశాలలో యాజమాన్య కమిటీలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా యాజమాన్య కమిటీల యొక్క బాధ్యతలను వివరించారు. ఎంఇఒలు బాలామణి, నెహ్రూజీ పర్యవేక్షణలో జరిగిన ఈ శిక్షణా కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్‌గా జె.పాపారావు, డి.రాము, జి.సతీష్ వ్యవహరించారు.

తాళ్లపూడిలో శిక్షణ ఇస్తున్న రిసోర్స్‌పర్సన్స్



ఉండ్రాజవరంలో శిక్షణలో పాల్గొన్న కమిటీల సభ్యులు

కడియంలో రెవెనూయ సదస్సులో పాల్గొన్న సర్పంచ్ రామ్‌జీ

భూ వివాదాల పరిష్కారానికి సదస్సులు

ప్రజాశక్తి-కడియం

గ్రామస్థాయిలో భూ వివాదాల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఉపయోగపడతాయని కడియం తహశీల్దారు కె.పోసుబాబు, సర్పంచ్ పాటంశెట్టి రామ్‌జీ అన్నారు. మండలంలోని కడియపులంక పంచాయితీ కార్యాలయం వద్ద గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సభలో రైతులను ఉద్దేశించి వారు మాట్లాడారు. భూ వివాదాలను తగ్గించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భూసమస్యల పరిష్కారానికి ఎలాంటి రుసుమూ ఉండదని తెలిపారు. సమస్యల పరిష్కార మార్గం కోసం రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉంటామని, ఎప్పుడైనా వచ్చి వారి అర్జీని తహశీల్దారు కార్యాలయంలో ఇవ్వవచ్చునని తెలిపారు. 33 రోజుల్లో భూ వివాదాలు కొలిక్కి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వివిధ అర్జీల పరిష్కారాన్ని రోజువారీగా పరిశీలన చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు, రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ సదస్సులో డిప్యూటీ తహశీల్దారు జి.మహాలక్ష్మి, విఆర్‌ఒలు లంక జ్యోతి, గంగరాజు, వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి సుస్మిత జోన్స్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

డివైడర్‌ను ఢీకొని ఇద్దరు మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీ కొని ఇద్దరు యువకులకు మృతి చెందారు. రాజమహేంద్రవరం మోరంపూడికి చెందిన ఇద్దరు యువకులు లింగం నవీన్‌చంద్, లింగం సంతోష్‌కుమార్ జగ్గంపేట వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు ద్విచక్ర వాహనంపై వెళు న్నారు. బుధవారం అర్ధరాత్రి ఒంటి గంటన్నర ప్రాంతంలో మురారి గ్రామం వద్ద డివైడర్‌ను ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో లింగం నవీన్ చంద్(21) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడు లింగం సంతోష్‌కుమార్(20) తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని వెంటనే రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ శివనాగు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యాపారి మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని జార్జిపేట కోనేరు సమీపంలో ఒక వ్యాపారి అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని నీలపల్లి గ్రామానికి చెందిన కుడిపూడి మల్లికార్జునరావు (45), జార్జిపేట గ్రామానికి చెందిన కాకరపల్లి శ్రీనివాసు ఇద్దరు స్నేహితులు. ఇద్దరూ ఉమ్మడిగా వ్యాపారం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మల్లికార్జునరావు తన వ్యాపార భాగస్వామి శ్రీనివాస్ ఇంటి వద్ద మెడకు ఉరి వేసుకుని మృతి చెందాడు. సంఘటన స్థలానికి కోరంగి ఎస్‌ఐ పి. సత్యనారాయణ చేరుకుని మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. అనుమానాస్పద మతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్య దుర్గామణి, కుమారుడు సిద్ధార్థ, కుమార్తె బేబీశంకర అనిజ ఉన్నారు.

రైలు ఢీ కొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట పట్టణంలోని ఎల్‌సి రైలుగేటు సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీ కొని 50 ఏళ్ల వయస్సుగల వ్యక్తి మృతి చెందాడు. గురువారం స్థానిక రైల్వే పోలీసులు అందించిన వివరాల ప్రకారం ఎల్‌సి గేటు సమీపంలో రైలు ఢీ కొట్టగా వ్యక్తి మృతి చెందాడని, అతని వివరాలు తెలియరాలేదని తెలిపారు. మృతుని శరీరంపై నీలం గడుల లుంగీ, ఎరుపు నలుపు చిన్న గడులు కలిగిన కురచ చేతుల చొక్కా ఉన్నాయనఅనరు. ఆచూకీ తెలిస్తే సామర్లకోట రైల్వే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

బైకులు ఢీకొన్న ఘటనలో గాయాలు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి జాతీయ రహదారిపై రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందన్నారు. రాజమహేంద్రవరం వైపు నుంచి జగ్గంపేట వైపు వెళ్తున్న బైక్ గ్రామంలో డివైడర్ దాటుతున్న మరో బైక్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గండేపల్లి మండలం నాయకంపల్లి గ్రామానికి చెందిన అనుశెట్టి కష్ణమూర్తి, దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామానికి చెందిన రాయుడు గోవింద్, ఆర్.చందులకు గాయాలయ్యాయి

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కోటనందూరు

గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడ్డి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. తుని రైల్వే ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు... తుని రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో తుని-గుల్లిపాడు మధ్య పాయకరావుపేట ఇందిరా కాలనీకి సమీపంలో రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించామన్నారు. తుని వైపు నుంచి నర్సీపట్నం వైపు వెళ్లున్న రైలు నుంచి జారిపడి మృతి చెందినట్టు అనుమానిస్తున్నామని తెలిపారు. మృతుని వయస్సు 21 ఏళ్లు ఉంటుందన్నారు. ఎరుపు రంగు చొక్కా, సిమెంట్ రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. మృత దేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

2వేల లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు గ్రామ శివారు సారా తయారీ కేంద్రంపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. 2వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని సిఐ సూర్యాఅప్పారావు తెలిపారు. పోలవరం కాలువ శివారులో ఉన్న సారా బట్టీపై సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. త్వరలోనే నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలిస్తామన్నారు. సారా తయారీ కేంద్రాలు, అమ్మకాలపై నిఘా ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ లక్ష్మీకాంతం, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని వద్దిపర్రు వద్ద మధ్య డెల్టా ప్రధాన కాలువలో పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం మల్లేశ్వరం గ్రామానికి చెందిన మేడిది శ్రీను. తన భార్యభర్తలు. జీవనోపాధి నిమిత్తం శ్రీను దుబాయ్, అతని భార్య రోజా సింగపూర్ వెళ్లారు. శ్రీను రెండు రోజుల క్రితం దుబాయ్ నుంచి వచ్చాడు. మండలంలోని వద్దిపర్రు గ్రామంలో వరసకు వదిన అయిన వీరవల్లి వెంకటలక్ష్మి వద్ద ఉంటున్న తన కుమారుడు, కుమార్తెను కలిసేందుకు గతేడాది డిసెంబర్ 31వచ్చాడు. అప్పటి నుంచి అక్కడే ఉంటున్నాడు. గురువారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో వద్దిపర్రు వద్ద మధ్య డెల్టా కాలువలో పడి చనిపోయాడు. శ్రీను సోదరుడు మేడిది వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఎన్.రాము తెలిపారు.

లారీ బోల్తా : వ్యక్తికి గాయాలు

రాజమహేంద్రవరం : నగరంలో లాలాచెరువు సమీపంలో గురువారం రాత్రి గ్యాస్ లోడ్ లారీ డివైడర్ ఢీకొని పార్కు సమీపంలో బోల్తా పడింది. లారీ వెనుకగా వస్తున్న ఆటోనగరర్‌కు చెందిన పోలవరపు శివన్నారాయణపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. రోడ్డుపై లారీ బోల్తా పడటంతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు క్రేన్ సహాయంతో లారీని పక్కకు తొలగించారు.

మేయర్‌గా పోటీ తథ్యం : గన్ని కష్ణ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రాబోయే నగరపాలక సంస్థ ఎన్నికల్లో మేయర్‌గా తాను పోటీలో ఉంటానని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ తెలిపారు. మోరంపూడిలోని శుభమస్తు ఫంక్షన్ హాల్లో గురువారం ఉదయం నిర్వహించిన మీడియా సమావేశంలో గన్ని కృష్ణ మాట్లాడారు. తొలుత మీడియా మిత్రులకు, నగర ప్రజలకు కూటమి శ్రేణులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియా మిత్రులతో మాట్లాడారు. మిత్రులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు. 2019 నుంచి 2024 వరకు వైసిపి పాలనలో ఆంధ్ర రాష్ట్ర ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమైందని అన్ని రంగాలూ దెబ్బతిన్నాయని తెలిపారు. 2024లో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని రంగాలనూ ప్రక్షాళన చేస్తూ ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నాలు మొదలుపెట్టారని తెలిపారు. ప్రస్తుతం ఆయన దృష్టి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి మీదే ఉందని తెలిపారు. చిన్నాభిన్నమైన ఆర్థిక వ్యవస్థను బాగు చేస్తున్నారని గన్ని పేర్కొన్నారు. వైసిపి హయాంలో ఆ ప్రభుత్వ తీరుపై గొంతెత్తిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ దాడులు చేసి అక్రమ అరెస్టులు చేసి కేసులు పెట్టిన విషయాలను గుర్తు చేశారు. చంద్రబాబు మాత్రం ఆ విధానంలో కాక ప్రధానంగా ఆర్థిక మూలాలపై దృష్టి పెట్టి మరోవైపు ప్రజల సంక్షేమం కోసం పని చేస్తున్నారని, దీన్ని పార్టీ శ్రేణులు అర్థం చేసుకోవాలన్నారు. పోలీసు శాఖలో కొంతమందిలో ఇంకా వైసిపి ప్రభుత్వ ఛాయలు ఉన్నాయని దీనిపై హోమ్ శాఖ మంత్రి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మేయర్‌గా పోటీపై అవసరమైతే పబ్లిక్ సర్వే నిర్వహించి అందులో 90 శాతం తనకు అనుకూలంగా రాకపోతే తాను పూర్తిగా రాజకీయాలనుంచి తప్పుకుంటానని గన్ని కృష్ణ ప్రకటించారు. తాను ఏ పదవి చేపట్టినా ఆ పదవులకు వన్ని తెచ్చేలా పని చేశానని తెలిపారు.

పుష్కర ఎత్తిపోతల పథకం పరిశీలన

ప్రజాశక్తి-సీతానగరం

పుష్కర ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న చైర్మన్

పురుషోత్తపట్నంలో తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకాన్ని పుష్కర కాలువ చైర్మన్ అడబాల సత్యనారాయణ గురువారం సందర్శించారు. ఎత్తిపోతల పథకం వద్ద గోదావరిలో ఉన్న నీటి మట్టాన్ని పరిశీలించారు. గోదావరి నీటిమట్టం తక్కువగా ఉన్నందున కోరుకొండ పరిసర ప్రాంతాలకు గాదరాడ, సీతారాంపురం, మురారి, కలవచర్ల, సింగరాయపురం ప్రాంతాలకు నీరు సరిగా అందని పరిస్థితి ఏర్పడింది. నీటి మట్టాన్ని పరిశీలించి రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నీరు అందేలా చూడాలని సంబంధిత అధికారులను చైర్మన్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పుష్కర కాలువ చైర్మన్ అడబాల సత్యనారాయణ, జనసేన నాయకులు తోట అనిల్ వాసు, అడపా వీరబాబు, ముక్కా రాంబాబు, కారిచర్ల విజయ శంకర్, వాకపల్లి రాజు, అడబాల ఆది విష్ణు, చదువు ముక్తేశ్వరరావు, ఉందుర్తి ఇస్సాకు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి -గోపాలపురం

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తహశీల్దారు అజయ్ బాబు

ఉద్యోగులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం ఎపి ఎన్‌జిఒలు కృషి చేయాలని తహశీల్దారు కె.అజయ్ బాబు అన్నారు. ఎపి ఎన్‌జిఒ క్యాలెండర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన సంఘం సభ్యులుగా చేరి సమస్యలపై పోరాటం చేయాలన్నారు. గోపాలపురం తాలూకా అధ్యక్షులు జోడాల వెంకట్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్, డిఎలు ఇస్తూ పిఆర్‌సి కమిషన్ వెంటనే రిపోర్ట్ ఇచ్చేలా కృషి చేయాలన్నారు.

గ్రామ సభలో మాట్లాడుతున్న తహశీల్దార్ ప్రసాద్

రీ సర్వేపై సత్యవాడలో గ్రామ సభ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్ట్ నిమిత్తం, మండలంలో పైలట్ గ్రామంగా ఎంపికైన సత్యవాడ సచివాలయంలో గురువారం నిర్వహించిన గ్రామ సభలో తహశీల్దారు పిఎన్‌డి.ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫీల్డ్ లెవెల్ ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డులు శుక్రవారం నుంచి 18 తేదీ శనివారం వరకు జరుగుతాయని, ప్రభుత్వ భూముల సర్వే ఈ నెల 21 నుండి 30 వరకు, ప్రైవేటు భూముల సర్వే ఫిబ్రవరి 02 నుంచి 27 తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ పెన్మెత్స ప్రసాద రాజు, గ్రామ రైతులు, మండల సర్వేయర్ జి.శ్రీనివాసరావు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్, ఎం.హరి ప్రసాద్, విఆర్ఒ జె.లక్ష్మీనరసమ్మ, గ్రామ సర్వేయర్ ఆర్.మారుతి శ్రీరామ్, పంచాయతీ కార్యదర్శి జి.ప్రసాదరావు పాల్గొన్నారు.

రోడ్డుపై గోతులకు మోక్షం

ప్రజాశక్తి-చాగల్లు

నిడదవోలు నుంచి పంగిడి ఆర్ అండ్ బి రోడ్డులో గోతులకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. పూడిక పనులను చేపట్టారు.ఆరు సంవత్సరాల క్రితం ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఉండేవని తెలిపారు. గతంలో ఈ రోడ్లు కొత్తగా వేసినప్పుడు బోర్డులు తీసేశారని ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, మలుపుల వద్ద పెట్రోల్ బంకులు వద్ద స్కూల్ వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రమాదం జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత క్వారీల్లో 50 టన్నుల క్వారీ లారీలు వెళ్లడంతో ప్రమాదం జరక్కుండా క్వారీ లారీల వేగం లేకుండా అధికారులు చూడాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలో విద్యుత్ సరఫరాకు శుక్రవారం, శనివారం అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్ శాఖాధికారి ఎస్.త్రిమూర్తులు తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోఉన్న అన్ని 11 కెవి.ఫీడర్స్‌కు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. దీని వల్ల చిక్కాల, చిక్కాలపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. కావున వినియోగదారులు అందరూ సహకరించవలసిందిగా కోరారు.

యానాం వార్తలు

కాకినిడ కలెక్టర్‌కు ఆహ్వాన పత్రాన్ని అందిస్తున్న మల్లాడి కృష్ణారావు

కాకినాడ కలెక్టర్‌తో మల్లాడి భేటీ

ప్రజాశక్తి - యానాం

కాకినాడ కలెక్టర్ షాన్ మోహన్‌తో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు గురువారం భేటీ అయ్యారు. తొలుత ఇరువురు పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొని పుష్పగుచ్ఛాలను అందిపుచ్చుకున్నారు..జనవరి 6 నుండి మూడు రోజులపాటు యానాంలో జరిగే ప్రజా ఉత్సవాలు, ఫల పుష్ప ప్రదర్శనలకు విచ్చేయాలని ఆహ్వాన పత్రికను కలెక్టర్ షాన్ మోహన్ కు మల్లాడి అందజేశారు. యానాంకు సంబంధించిన పందులంక సొసైటీ వివాదం, యానాంకు 5 ఎకరాల భూమి కేటాయించాల్సిన అంశాలపై చర్చించారు.

ఎంఎల్ఎ అశోక్‌కు అధికారుల శుభాకాంక్షలు

ప్రజాశక్తి - యానాం

నూతన సంవత్సరం సందర్భంగా స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌కి వివిధ శాఖల అధికారులు గురువారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి ఎంఎల్ఎ అశోక్‌న కలిసి దుస్సాలువాతో సత్కరించారు. అనంతరం ఎంఎల్ఎ అశోక్ మునిస్వామిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ, అగ్నిమాపక, ఆరోగ్యశాఖ, వ్యవసాయ శాఖ, టీచర్స్ అసోసియేషన్, పాలిటెక్నిక్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా ఉత్సవాలపై ఆర్ఎఒ సమీక్ష

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గంలో జనవరి 6 నుంచి 8 వరకు నిర్వహించే ప్రజా ఉత్సవాలు, ఫల పుష్ప ప్రదర్శనలపై ఆర్ఎఒ మునిస్వామి తన ఛాంబర్‌లో అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లాడి మాట్లాడుతూ ముఖ్యమంత్రి, గవర్నర్ చేతుల మీదుగా ప్రారంభించే పలు అభివృద్ధి పనులను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజా పనుల శాఖ, మత్స్యశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, పౌరసరఫరాల శాఖ, పశు వైద్య శాఖ, మున్సిపాలిటీ తదితర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గోపాలపురం

ఆర్థిక సాయం అందిస్తున్న సువర్ణరాజు

ఆపదలో ఉన్న అభాగ్యులకు జనసేన పార్టీ అండగా ఉంటుందని పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు అన్నారు. మండలంలోని సాగిపాడులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కుక్క పవన్ కుటుంబ సభ్యులను సువర్ణ రాజు గురువారం పరామర్శించారు. ఆ కుటుంబానికి రూ.10 వేల సాయం, 25 కేజీల బియ్యం ప్యాకెట్ అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలకు అనుగుణంగా అభాగ్యులను ఆదుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. షేక్ హుస్సేన్, మద్దాల కాశీ విశ్వనాథ, పులి సత్యనారాయణ, కడియం శ్రీనివాస్, అంకోల్లు మోహన్, గుదే సత్యనారాయణ, జుత్తుక పార్థసారథి, యడ్లపల్లి పోసిబాబు, పులి రాంబాబు పాల్గొన్నారు.

ఎంఇఒలను సన్మానించిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-తాళ్లపూడి

ఎంఇలను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

నూతన సంవత్సర సందర్భంగా ఎంఇఒలు బాలామణి, నెహ్రూజీలను ఉపాధ్యాయులు గురువారం ఘనంగా సత్కరించారు. వేగేశ్వరపురం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎంఇఒలను కలసి వారితో పాటు పలు పాఠశాలల సముదాయాల చైర్మన్‌లు సుబ్బలక్ష్మి, శ్రీవాసవిలను ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు, యాజమాన్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు రాము కృతజ్ఞతలు

ప్రజాశక్తి - నిడదవోలు

తనను ఎంఆర్‌పిఎస్ నిడదవోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించిన మంద కృష్ణ మాదిగకు గాలింకి రాము కృతజ్ఞతలు తెలిపారు. 17వ వార్డు సుబ్బరాజుపేటలో గురువారం నిర్వహిరంచిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తర కోస్తాంధ్ర జిల్లాల ఇంచార్జ్ ముమ్మిడివరపు సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు గెడ్డం వినోద్‌కు అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలో కొంతమంది ఎంఆర్‌పిఎస్ పేరు చెప్పుకుని పలు విద్య, వ్యాపార సంస్థల యజమానుల వద్ద వసూళ్లకు పాల్పడుతున్నారని, వారు తీరు మార్చుకోకుంటే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

డీలర్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలో ఖాళీగా ఉన్న 18 రేషన్ డీలర్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహశీల్దార్ పి.త్రినాథరావు తెలిపారు. తాళ్లరేవు పంచాయతీలో 3, కోరంగి పంచాయతీలో 5, గాడిమొగలో 3 జి.వేమవరం 3, లచ్చి పాలెం 1, తంగేడు పంపు1, రామన్నపాలెం 1, చొల్లంగి1 ఖాళీగా ఉన్నాయన్నారు. రిజర్వేషన్ ప్రాతిపదికన స్థానికులకు అవకాశం కల్పిస్తారన్నారు. ఈ నెల 19న కాకినాడలో రాత పరీక్ష జరగుతుందన్నారు. 18 నుంచి 40 ఏళ్ల వయస్సు కలిగిన ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. దరఖాస్తులు స్థానిక తహశ్శల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈనెల 8దీలోపు దరఖాస్తులను అందించాలన్నారు.

వెంకన్నదొర కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని బలరామపురం మాజీ సర్పంచ్ సోమరౌతు భాస్కర వెంకన్న దొర ఇటీవల అనారోగ్యం గుర్రై మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఎంఎంఆర్ ట్రస్ట్ ఛైర్మన్, వైసిపి నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు గురువారం పరామర్శించారు. మృతికి గల కారణాలను ఆయన కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

మేనరిక వివాహాలపై కళాజాతా

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని నాగులాపల్లి, ఇసుకపల్లి గ్రామాల్లో మేనరికం వివాహాలపై పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సౌజన్య ఆధ్వర్యంలో కళా జాతర కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య భారతి కళా సంఘం ఆధ్వర్యంలో మేనరికం వివాహాలు-వాటి దుష్ప్రభావాలపై బుర్ర కథ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగులాపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సౌజన్య, డాక్టర్ రిచ్చా, హెచ్ఎస్.అప్పారావు, హెచ్ఇ గౌరీశ్వరి, హెచ్‌వి.జ్యోతిప్రసన్నకుమారి, హెల్త్ అసిస్టెంట్ కాకరపల్లి గంగాధర్ శ్రీనివాసరావు, ఎఎన్ఎంలు ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ సభలో 18 దరఖాస్తులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని ఆనూరు, కొండపల్లి గ్రామాల్లో గురువారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభల్లో ప్రజల నుంచి సమస్యలు పరిష్కారం కోరుతూ 18 దరఖాస్తులు అందాయని తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి తెలిపారు. ఈ సభల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆన్‌లైన్ ఆర్ఒఆర్ కోసం 4, పట్టాదారు పాస్ పుస్తకం కోసం ఒకటి, భూమి సర్వే కోసం 13 దరఖాస్తులు అందాయన్నారు.

మహారాజశ్రీ కాకినాడ 3వ జిల్లా జడ్జి వారి కోర్టులో
I.A. 1023/2024 in O.S. 82/2007
Between:
1) పాలకుర్తి సుబ్బారావు (డైడ్)
2) పాలకుర్తి సీతా మహాలక్ష్మి
3) పాలకుర్తి సత్యనారాయణ ప్రసాద్ ...వాదులు
మరియు
వుమ్మెళ్ళ అన్నపూర్ణమ్మ వగైరా ...ప్రతివాదులు
29వ ప్ర రెస్పాండెంట్ ...ప్రతివాది
బొడ్డు విజయకుమార్, తండ్రి: శ్రీకృష్ణారావు, డోర్ నెం.16-5-10, కొత్తూరు, సామర్లకోట-533440, కాకినాడ జిల్లా
పై నెంబరు పిటిషన్‌లో (మిమ్ములను మీ అమ్మ గారు సత్యవతి చనిపోయినందున వారసులుగా చేర్పించమని) మీకు శ్రీ కోర్టువారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను తీసుకొనుక EVADE చేసినందున, నోటీసు పేపరు ప్రకటన ద్వారా ఇమ్మని శ్రీ కోర్టును వారు ఆర్డర్ చేసియున్నారు. వాయిదా 10-01-2025 సంవత్సరమునకు ఉన్నది. మీరు వాయిదా రోజు అనగా 10-01-2025 సం॥తేదీన ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా కోర్టుకు హాజరై ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల మనవి చేసుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం)
ఉప్పులూరి రామారావు
కాకినాడ
ది.31-12-24
అడ్వకేట్, 63-3-4బి, ఉప్పులూరివారి వీధి
కాకినాడ-3, సెల్: 99490 45514

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి సబ్ స్టేషన్ పరిధిలో మెయింటినెన్స్ నిమిత్తం శుక్రవారం ఉదయం 08.00 గంటల నుండి 12.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఇఇ ఎన్.నారాయణ అప్పారావు తెలిపారు. 11 కెవి ఇండస్ట్రియల్ ఫీడర్, 11 కెవి బంధపురం, 11 కెవి అచ్చయ్యపాలెం, 11 కెవి గొల్లగూడెం ఫీడర్లలో ఉదయం 08.00 గంటల నుండి 12.00 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

CHANGE OF NAME
I, NEELIMA MADHU, W/o. Srinivasa Rao Sirigudi, R/o. D.No.70-3-72/1, Kothuru Street No.1, Ramanayyapeta, Kakinada (Urban), PO Engg. College, Kakinada District - 533 003, Andhra Pradesh has changed my Spouse Name from SRINIVASA RAO SIRUGUDI (old Name) to SRINIVASA RAO SIRIGUDI (new Name) for all future purposes.

డాక్టర్ యనమదలకు 'మానవతా' అవార్డు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రముఖ ఎయిడ్స్ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ యనమదల మురళీకృష్ణ మానవతా స్వచ్ఛంద సేవాసమితి అవార్డును అందుకోనున్నారు. వైద్య రంగంలో పేదలు, సామాన్యులకు ఎటువంటి ఖర్చు లేకుండా వైద్య సేవలు అందిస్తున్నందుకు గానూ ఆయనకు ఈ అవార్డు లభించింది. ముఖ్యంగా ఎయిడ్స్ వ్యాధి పట్ల పలువురు రోగులకు అవగాహన కల్పించడంతోపాటు అతి తక్కువ ఖర్చుతోనే వ్యాధి నిర్మూలనకు యనమదల కృషి చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన మానవతా స్వచ్ఛంద సేవాసమితి 50వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 5న అమలాపురం జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో జరగనున్న కార్యక్రమంలో అవార్డు ప్రధానం చేయనున్నారని డాక్టర్ మురళీకష్ణ తెలిపారు.

ధాన్యం వ్యాపారి అరెస్టు

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని చంద్రవరం గ్రామానికి చెందిన గారపాటి సత్తిబాబు వద్ద కొవ్వూరు పట్టణానికి చెందిన దుద్దుపూడి సూరిబాబు ధాన్యం కొంటానని చెప్పి నాలుగు లోడుల ధాన్యం తీసుకెళ్లాడు. డబ్బులు ఇవ్వకుండా మోసగించి పరారైనట్టు సత్తిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.నరేంద్ర కేసు నమోదు చేశారు. సూరిబాబును అరెస్టు చేసి గురువారం నిడదవోలు కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించినట్టు తెలిపారు. సూరిబాబుపై కొవ్వూరు రూరల్, కొవ్వూరు టౌన్, సీతానగరం, గోకవరం, జంగారెడ్డిగూడెం, ఐ.పోలవరం, పెడన, వీరఘట్టం తదితర పోలీస్ స్టేషన్లలోనే కాక ఒడిషాలో కూడా పలు మోసపూరిత నేరాలు చేసినట్టు తెలిపారు. ధాన్యం, మొక్కజొన్న, మైదా, నూకలు వంటివి ఎక్కువ రేటుకు కొంటానని నమ్మించి వారి వద్ద నుండి లోడులు తీసుకుని వెళ్లి అమ్ముకుని వారికి డబ్బులు ఇవ్వకుండా పరారవుతున్నట్టు తెలిపారు.

బాలల పరిరక్షణకు కృషి చేయాలి

పెద్దాపురం : బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసిడిఎస్ పీడీ కె.ప్రవీణ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ సిడిపిఒ జి.ఉష అధ్యక్షతన మండల స్థాయి కిశోర బాలికా వికాసంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రతి గ్రామస్థాయిలో 11 నుంచి 18 సంవత్సరాల మధ్య వయసుకులైన బాలలతో గ్రూపులు ఏర్పాటు చేసి వారికి బాలల చట్టాలు, బాలల పరిరక్షణ అంశాలు, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్య రక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎంపిడిఒ శ్రీలలిత, ఎస్ఐ మౌనిక మాట్లాడారు. ఈ సదస్సులో డాక్టర్ బి.చంద్రకిరణ్, ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పడిపోయినవి
విశాఖపట్నం రేసపువానిపాలెంలో అపార్ట్‌మెంట్‌లోని ప్లాటుకు సంబంధించి అల్లూరి వీర వెంకటపతి రాజు, S/o. వెంకట సుబ్బరాజు, సర్వే నెంబర్ 7, ప్లాట్ నెంబర్ 36బి, 51బి కు సంబంధించిన 1360/1996 నెంబరు గల డాక్యుమెంట్ పడిపోయినవి. ది. 26-12-2024వ తేదీన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాట్రేనికోన మండలంలోని మా ఇంటి వద్ద నుండి జిరాక్స్ నిమిత్తం గేటు సెంటర్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గం మధ్యలో పడిపోయినవి. దొరికిన వారు ఈక్రింది అడ్రస్‌కు అందజేయగలరు.
అల్లూరి వీర వెంకటపతిరాజు
S/o. వెంకట సుబ్బరాజు, మెయిన్‌రోడ్
కాట్రేనికోన గ్రామం మరియు మండలం
డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్: 8247550212

IN THE COURT OF THE HON'BLE XXVII ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: SECUNDERABAD
O.P.No. 603 OF 2024
Between:
N. Bhumamma and others ...Petitioners
AND
M. Rajesh & Others ...Respondents
To,
R-1: M. Rajesh, S/o. Srinivasa Rao, Aged: 26 years, Occ: Driver, R/o. H.No. 6-93, Madurapeta, Uppalaguptham, East Godavari District, Andhra Pradesh-533222.
NOTICE
Please take notice that the above Petitioners have filed the above O.P. for compensation against you and Respondent No. 2 & 3. Several times notices was issued to you through court and R.P. but you have failed to receive the same. The case is posted on the day of 24-01-2025 for your appearance, on that day you have to appear either personally or through your counsel at 10.30 a.m. otherwise the matter will be decided in your absence.
(BY THE ORDER OF THE COURT)
Sd/- L.R.PRAKASH, C.D.ARUNA, H. SHARON, Advocates,
H.No. 10-308/A/2, Vasanthapuri Colony, Malkajgiri, Hyderabad.
Cell: 9866611022

పబ్లిక్ నోటీసు
మహారాజశ్రీ పెద్దాపురం 7వ అధనపు జిల్లా ఫాస్ట్ ట్రాక్ జిల్లా జడ్జి వారి కోర్టులో
గార్డియన్ ఒ.పి.నెం.96/2024
బిట్వీన్:-
వల్లూరి కృష్ణ సాయి నిహాల్ మైనర్ అయినందున తల్లి గార్డియన్ వల్లూరి మంగలక్ష్మి ...పిటీషనర్
మరియు
నిల్ ...రెస్పాండెంట్లు
ఈ నెంబరు గ్రంథములో పిటీషనరు వల్లూరి మంగలక్ష్మి భర్త. (లేటు) సత్యనారాయణ, వ. 37 సం.లు, డోర్.నెం.9-35రు, ధ్వజస్తంభం వీధి, జి.మేడపాడు గ్రామం, సామర్లకోట మండలం అను వారు ఆమె కుమారుడు వల్లూరి కృష్ణ సాయి నిహాల్, తండ్రి. (లేటు) సత్యనారాయణ, వ. 15 సం.లు, 10వ తరగతి, డోర్.నెం.9-35రు, ధ్వజస్తంభం వీధి, జి.మేడపాడు గ్రామం, సామర్లకోట మండలం తరుపున పై కోర్టులో పై నెంబరు దాఖలా గార్డియన్ పిటీషన్ ను ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూమిలో సదరు మైనరు వల్లూరి కృష్ణ సాయి నిహాల్ తాలూకు 1/3వ వంతు వాటాను విక్రయించుటకు గాను శ్రీ కోర్టు వారి అనుమతి కోరుతూ పై నెంబరు పిటీషనును దాఖలు చేసినారు. సదరు గ్రంథము పై కోర్టు వారి ఎదుట ది.20-01-2025వ సం.రం తేదీకి వాయిదా అయి వున్నది.
కావున పై నెంబరు గ్రంథములో ఎవరికైనా ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల పై కోర్టు వారి ఎదుట ది.20-01-2025వ సం.రం తేదీన ఉదయం 10:30 గంటల లగాయితు హాజరై వారి ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల శ్రీ కోర్టు వారు తదుపరి ఉత్తర్వులు ఇప్పించుదురు.
షెడ్యూలు
తూర్పుగోదావరి జిల్లా, బిక్కవోలు సబ్ రిజిస్ట్రీలో చేరిన రంగంపేట మండలం, మర్రిపూడి గ్రామ పంచాయితీ, మర్రిపూడి గ్రామం తాలూకు జిరాయితీ మెరక భూమి రి.స.నెం. 45రులో య.2-00ట్లు భూమికి హద్దులు :
తూర్పు: వల్లూరి వెంకటేష్ గారి భూమి
దక్షిణం: రిమ్మలపూడి వెంకటేశ్వరరావు గారి భూమి
పడమర: రిమ్మలపూడి చినసత్తిరాజు గారి భూమి
ఉత్తరం: రిమ్మలపూడి సుబ్బయ్యమ్మ గారి భూమి
సదరు హద్దులు మధ్య య.2-00ట్లు భూమిన్ని అందలి మామూలు మార్గములు, నీటివనరులు, యీజిమెంటు హక్కులతో సహా,
సిహెచ్. కనకదుర్గారావు
సిహెచ్. చంద్రశేఖర్
పెద్దాపురం
02-01-2025
అడ్వకేట్స్,పెద్దాపురం
కాకినాడ జిల్లా